# తామర పూలు (కథ)

బాల్యం... ఆ పదం గారడిచేస్తుంది. ఆ పదం వినగానే మబ్బులమీద స్వారీ చేస్తున్నట్లూ - నక్షత్రాలతో ఆడుకుంటున్నట్లూ అనిపిస్తుంది. అలా విహరిస్తూపోతే చందమామ ఎదురవుతాడు. ఆ చంద్రునిలో ఒక పొన్న చెట్టు ఉంటుంది. ఆ చెట్టుక్రింద ఒక ముసలవ్వ కూర్చుని ఉంటుంది. ఆమె రాట్నంమీద దారం తీస్తుంటుంది. అలా అలా విహరించి దిగివస్తే మా ఇంటి ముందరి రెండు చింతచెట్లు గుర్తుకువస్తాయి.

ఆ రెండు చింతలు - వాటి సాంద్రచ్ఛాయలో బంగారు బాల్యం కరిగిపోయింది. అందకుండా పోయింది. దొరక్కుండా పోయింది.

నా బాల్యం వెళ్లిపోయింది.

తిరిగి చూడకుండా పోయింది.

కనిపించకుండా పోయింది.

మా యింటి ముందరి రెండు చింతలు, చలికాలంలో వెచ్చని నీడ! ఎండాకాలంలో చల్లని నీడ! ఒక్క చింత కింద నర్సిగాని గుడిశ.

నర్సయ్య నా బాల్యమిత్రుడు. అతనితో - ఆ చింతల నీడన ఎన్ని ఆటలు ఆడామో! గోలీలు ఆడాం. చిర్రగోనె ఆడాం. బిళంగోడు ఆడాం. మొగల్ పఠాన్ ఆడాం. దాగుడు మూతలు ఆడాం. ఉప్పు బెర ఆడాం.

ఆటలు! ఆటలు! అటువంటిదే బాల్యం!

ఉంటుందా వెర్రి బాగులుది! వెళ్లిపోయింది!!

దీపావళి వచ్చిందంటే పండుగలకు పండుగ! టపాకులు - మతాబులు లేవు. కోలలు చేసుకునేవాళ్లం. వాటిని పోటీపడి గిరగిరా తిప్పేవాళ్ళాం. ఒక జ్వాలా వలయం! ఒకటి కాదు - రెండు కాదు. అనేక జ్వాలా వలయాలు!! ఇంద్రధనుస్సులు గిరగిరా తిరిగుతున్నట్టుండేవి.

అప్పుడప్పుడూ మా పక్క ఇంటి సీత వచ్చేది. చింతల నీడకు రవంత దూరంలో బొడ్డుమల్లె పున్నాగ - చెట్టు ఉండేది. సీత ఆ పూలు ఏరుకోవడానికి వచ్చేది. తెల్లవారే వరకు బొడ్డు మల్లెలు - నేల కానరాకుండా రాలేవి. సీత పూలు ఏరడం బాగనిపించేది. ఆమెకు వడి నిండా పూలు ఏరిపెట్టడం సరదా! నర్సయ్య చెట్టును ఊపుతాడు. పూలు - వానలా రాల్తాయి. ఆ రాలడం సీతా, నేనూ సంబరంగా చూసేవాళ్ళం.

సీత వడి నిండితే గంతులేసుకుంటూ పరిగెత్తేది. మేమిద్దరం చూస్తూఉండేవాళ్ళం! ఆమె లేడిలా గంతులువేస్తూ పరిగెత్తేది.



యువకుడుగా

బొడ్డు మల్లెపూవు కాడ తుంపి నోట్లో పెట్టుకుని ఊదేవాళ్ళం. సీత కూడా ఉన్నప్పుడు ఆ ధ్వని విని ఆమె కిలాకిలా నవ్వేది! ఆమె కళ్ళు పెద్దవి. అలా నవ్వినప్పుడు చిన్నవి అయ్యేవి. మేమూ ఆమెతో కలిసి నవ్వుతాం.

కాని సీత నవ్వే వేరు!

ముత్యాలు రాల్తాయి.

ఒక్కోసారి పూలు తీసి తన వ్రేళ్ళతో సుతారంగా మాల అల్లేది. అలా బారెడు మాల అల్లుతుంటే ఆశ్చర్యంగా చూస్తూ ఆమె పాదాల చెంత కూర్చునేవాణ్ణి!

అది ఒక ఆనందం!

అది ఒక అంబరం అందటం!!

సీత బారెడు మాల అందుకొని నిర్దయగా వెళ్లిపోయేది! ఆమె నడకను చూస్తూ ఉండిపోయేవాణ్ణి!!

వర్షాకాలం హర్షకాలం! అది వచ్చిందంటే మా ఆనందానికి అవధుల్లేవు. జోరున వానలో ఎగిరేవాళ్ళం. గంతులేసేవాళ్ళం. వర్షంలో నుంచొని - నెత్తి మీదినుంచి పడే వాననీరు - ముక్కు మీదినుంచి జారుతుంటే - నాలుకతో చప్పరించడం!

అదొక మహత్తర అనుభూతి!

అది చెప్పడానికి భాష లేదు! పదాలు చాలవు!!

మా ఇంటి పక్కనుంచి పంటకాలువ పారుతుంది. ఉదయం నర్సయ్యా, నేనూ బయలుదేర్తాం. ఇసుకలో కాళ్ళు ఈడుస్తూ కాలువలో నడుస్తాం. మధ్యమధ్యన ఎగురుతాం. గంతులేస్తాం. నీళ్ళు చల్లుకుంటాం. అలా చెరువు తూముదాకా నవ్వుతూ తుళ్ళుతూ సాగిపోతాం.

అక్కడ కాలువ నుంచి బయటపడతాం. చెరువు కట్టలు ఎక్కుతాం.

అది మా ఊరి చెరువు. దాని పేరు ముత్యాలమ్మ కుంట. చెరువు పక్కన పెద్ద రాతి పరుపు. దాని మధ్యన ఒక ముద్దువచ్చే మర్రిగున్న. దానికి ఆవల ముత్యాలమ్మ గుడి. చెరువు కట్ట దిగువన గుబురు నాగజముండ్లు! వాటిని ఆనుకొని పచ్చని పొలాలు! చెరువు కట్టమీద అక్కడక్కడా మోదుగు చెట్లు.

మేము చెరువు కట్ట ఎక్కి చూస్తే చెరువులో నీళ్ళు కనిపించేవి కావు. చెరువు నిండా పరుచుకున్న పచ్చని తామరఆకులు. వాటిమీద ముత్యాల్లా మెరిసి - ఆటలాడే నీటిబిందువులు - రెండాకులకు ఒక పూవు చొప్పున విచ్చుకున్న తామరలు. వాటిమీద ఎగిరే నల్లని తుమ్మెదలు. అబ్బో! అదొక మహాద్భుత దృశ్యం!

లోకంలోని తామరలన్నీ అక్కడే చేరినట్లు!

లోకంలోని అందాలన్నీ అక్కడే రాశి పోసినట్లు!

అది మాటలకు అందని అందం. ఆ అందం వదలడం ఇష్టం కాదు. అక్కణ్ణుంచి కదలను.

ఎండ ఎక్కుతుంది. అవి మరింత అందం సంతరించుకుంటాయి.

ఎండ చురుక్కుమంటుంది. అయినా కదలను. ఆ అందం వదలరానిది. వదలను! నర్సయ్య జ్ఞాపకంచేస్తాడు - ఇంట్లో కొడ్తారని! అతడు నన్ను లాక్కుపోతాడు. దూరంగా అమ్మ కనిపిస్తుంది. అన్నానికి పిలవడానికి వస్తుంది. ఇహ తప్పదు. వెళ్ళిపోతాను! అయినా తామరల చెరువు నన్ను విడువదు! వెంటనే వస్తుంది!

ఒకనాడు చెరువును అలా చూస్తున్నాను. తామరలు పరుచుకొని పడుకోవాలనిపించింది.

"నర్సయ్యా! పూలు తెస్తవా? వాటిమీద పడుకోవాలె ననిపిస్తున్నది" అన్నాను.

"అట్లనురి, ఇగొ దిగితి. బండెడు కోస్తి" అన్నాడు నర్సయ్య.

అయితే, అన్ని పూలు తెంపడం మనసొప్పలేదు. రెండు తామరలు కోయించాను. రెండు చేతుల్లో పట్టుకున్నాను. తామర తూళ్లు మంచుతీవల్లా చల్లగా హాయిగా ఉండేవి. వాటి చివరన వికసించిన పద్మాలు!!

అలా వెళ్తున్నప్పుడు సీత కనిపించింది. రెండు తామరపూలు సీతకు అందించాను. సీత అవి అందుకున్నది. ఎగిరింది. గంతేసింది. చెంగుచెంగున ఎగురుతూ మాయం అయింది. బహుశా ఒక రాజ్యం చేతి కందినా అంతకు మించి ఆనందించరు!

నేను చింతల నీడలో - గుడి స్తంభం మీద కూలబడ్డాను. చెరువు పక్క నున్న పరుపు బండ మధ్య మర్రిగున్న కింద సీత కూర్చుంటుంది. నేను గంపలతో తామరలు తెస్తాను. ఆమె ముందు పోస్తాను. సీత బొడ్డుమల్లెలతో వలె తామరపూలతో మాల అల్లుతుంటుంది. నేను ఆమె పాదాల చెంత చతికిలపడి సీత వ్రేళ్ళ కదలికలు చూస్తూ ఉండిపోతాను!

అదీ దృశ్యం! అలా జరగాలని ఊహ!!

ఒకనాడు సీత చేయి పట్టుకొని చెరువుకు రావవసిందని ప్రాధేయపడ్డాను.

"ఛీ! ఆడపిల్లలు చెరువుకొస్తరా? మా అమ్మ చంపుతది" అని నన్ను విడిచి రాతిబొమ్మలా సాగిపోయింది!

నేను కుప్పకూలిపోయాను. సీత తామరలు కడ్తుండగా చూడలేను!

సాయంత్రం మళ్ళీ చెరువుకు వెళ్ళేవాళ్ళం. అంత అందం కనిపించేది కాదు. అందం సొంతం ఎవడో దోచుకుపోయాడు అనిపించేది. అయినా ఉదయం విచ్చుకున్న పూలనూ - సాయంత్రం ముడుచుకున్న పూలనూ చూడకుండా ఉండలేకపోయేవాణ్ణి.

ఒకరోజు నాయనమ్మను అడిగాను. "ఎండకేమో" అన్నది.

తామరలను కాపాడాలి. వాటికి ఎండ తగలరాదు. ఇంట్లోంచి చింతగింజలు తీసికెళ్ళాను. చెరువు కట్టమీద నర్సయ్య గుంతలు తీశాడు. నేను గింజలు వేశాను. పూడ్చాను. చింతలు పెరుగుతాయి. వాటి చిక్కని నీడలో తామరలు వాడవు! అలా అనుకొని రోజూ చెంబులతో వాటికి నీళ్ల పోశాం.

కొన్ని రోజుల తరవాత మొక్కయి మొలిచాయి! పచ్చని రెండు గింజలను చీల్చుకొని - చిగురు కిరీటంగా వచ్చిన మొక్కల బారులు మురిపించాయి. వాటిని వదలబుద్ధి కాదు!

ఒకనాడు చెరువు కట్టకు వెళ్ళాం. అక్కడ మొక్కల్ను పశువులు తొక్కేశాయి. మేకలు మేసి పోయాయి. మొక్కలు ఉన్న జాడ కూడా మిగల్లేదు. నాకు ఏడుపు వచ్చింది. పెద్దగా ఏడ్చాను. ఎక్కెక్కి ఏడిచాను. మంచినీళ్ళకు వచ్చిన ఆడవాళ్ళు చూచారు. కారణం తెలుసుకున్నారు. నవ్వారు. కొంగుతో నా కన్నీళ్లు తుడిచారు. నన్ను ఇంటికి తీసికెళ్ళారు. మా నాయనకు అప్పగించారు. మా ఇంట్లో అంతా నన్ను చూశారు. విరగబడి నవ్వారు.

"వెర్రి వెధవా! తామరలు ఎండకు వాడవు, విచ్చుకుంటవి. సూర్యుడు క్రుంగుతె ముడుచుకుంటవి" అన్నారు నాయన.

అయితే, ఇదంతా సూర్యుని పని. వాణ్ణి క్రుంగకుండా చేయాలి! ఏం చేయాలి? గొడుగు పట్టుకుంటే సరి. ఒక్క గొడుగు చాలదు. ఇంట్లో ఒక్కటే గొడుగు ఉంది!

రంగాచార్య దంపతులు

తాటిచెట్టు ఎక్కి సూర్యుణ్ణి పట్టవచ్చు. కాని, దానికి ఇంకా పెద్దవాణ్ణి కావాలి! మునికాళ్ళమీద లేచినా గూడు అందలేదు.

ఆకాశం వంగే చోటికి వెళ్లాలి! అదిగో, అక్కడ సూర్యుణ్ణి పట్టాలి! నర్సయ్యను వెంటపెట్టుకొని బయలుదేరాను. ఎంత దూరం వెళ్ళినా ఆకాశం వంగిన చోటు రాలేదు. సాయంత్రానికి ఇల్లు చేరుకున్నాం. అంతా నాకోసం పరేషానుగా ఉన్నారు.

మా నాయన గద్దించారు. "ఆకాశం వంగిన చోటికి" అన్నాను.

"మామ్మే! మా నాయనే!" అని మా అమ్మ గట్టిగా కౌగలించుకొని ముద్దులాడింది. ఆకాశం వంగే చోటు ఉండదని చెప్పింది.

ఆనాటి అమ్మ ముద్దుల ఆనందం మరలి వచ్చేనా!!!

వర్షాకాలం దాటిపోయింది. ఎండలకాలం వచ్చింది. చెరువు సాంతం ఎండిపోయింది. ఆ తామరలు - ఆ అందం అంతా అంతరించింది. పందులు తామర దుంపలు తవ్వుకొని తింటున్నాయి.

నా మనసు నెర్రెలు వారింది!

చెరువు కట్టన ఉన్న మోదుగులు విరగపూశాయి. ఒక్క ఆకు లేదు. చెట్లు సాంతం నిప్పు కణికలతో కణకణలాడుతున్నాయి. పూసిన మోదుగుల అందం చూచితీరాలి. అయినా, తామరల్లా అనిపించేవి కావు. నాలో తామరల తాపం చల్లారలేదు.

బొడ్డు మల్లెలు లేవు. సీత మల్లెలు ముందు పోసుకొని మాల అల్లుతుండేది. ఒకనాడు వడి నిండా మోదుగు పూలు తెచ్చి పోశాం. "మోదుగు పూలు మాల కడ్తరా?" అని చివాలున లేచి వెళ్లిపోయింది.

చెరువు కట్టకు వెళ్లినప్పుడల్లా బీటలువారిన చెరువును చూస్తే ఏడుపు వచ్చేది. "వానాకాలం వస్తది. చెరువు నిండుతది. తామరలు పూస్తయి" అనేవాడు నర్సయ్య.

వానాకాలంకోసం ఎదిరిచూపులు! ఎదిరిచూపులు!! ఎదిరిచూపులు!!!

మృగశిర ప్రవేశిస్తే వర్షం వస్తుందన్నారు మా నాయన! మృగశిర రానే వచ్చింది. బెల్లంలో ఇంగువ పెట్టి మింగించింది నాయనమ్మ.

వాన పడుతుంది! చెరువు నిండుతుంది. తామరలు తంపరలుగా పూస్తాయని ఆశ!!!

రోజంతా ఎదిరిచూశాను. రాత్రి సాంతం మేలుకున్నాను. ఆకాశంమీదనే దృష్టిని నిలిపాను. మబ్బులు రాలేదు. వాన కురవలేదు. నా ఆశ ఫలించలేదు.

చెరువును చూచి ఏడుపు వచ్చింది. మోదుగుపూలు కూడా లేవు. ఎడారి వలె ఉంది. బీడుగా ఉంది. దాడి జరిగినట్లుంది.

రోజులు గడుస్తున్నాయి. చినుకు రాలడంలేదు.

"వాన రావటానికి ఏం చేస్తరు?" నర్సయ్యను అడిగాను.

"ఆంజనేయస్వామికి నీళ్ళు పొయ్యాలె" అన్నాడు.

ఆనాడు తలమీంచి స్నానం చేశాను. తడి తలతో, తడి బట్టలతో, నెత్తిన తప్పేలడు నీళ్ళతో ఆంజనేయస్వామి గుడికి వెళ్ళాను. స్వామి పాదాలమీద నీళ్ళు గుమ్మరించాను. కళ్ళు మూసుకొని ప్రార్థించాను.

"స్వామీ! వాన పడెయ్యి. చెరువు నింపు. తామరలు పూయించు."

రోజులు గడుస్తున్నాయి. వాన రాలేదు. చెరువు నిండలేదు. తామరలు పూయలేదు.

ఆనాడు తడిసిన తలలతో, తడిసిన బట్టలతో మా ఇంటికి కొందరు పిల్లలు వచ్చారు. వారిలో ఇద్దరు రోకలిని చెరొకవైపు భుజాలుమీద పెట్టుకున్నారు. రోకలి మధ్యన గుడ్డలో కప్పను కట్టి తెచ్చారు.

"కప్పా తల్లి నీళ్లాడె - కడవా నిండా వానా కురిసె
దోమా తల్లి నీళ్లాడె - దొడ్లా నిండా వానా కురిసె
ఈగా తల్లి నీళ్లాడె - ఇంటీ నిండా వానా కురిసె
పాముా తల్లి నీళ్లాడె - పటువా నిండా వానా కురిసె."

వారు అలా ఎందుకు వచ్చారని అడిగాను. "కప్పతల్లికి నీళ్ళు పోస్తే వాన కురుస్తది" అన్నారు.

"వాన కురుస్తదా! చెరువు నిండుతదా!! తామరలు పూస్తయా!!!" అడిగాను.

"ఓ! కురుస్తది" అన్నారు.

బావి దగ్గరకు ఉరికా. నీళ్ళు తోడా. తప్పేల నింపా. తప్పేలతో తెచ్చి కప్ప తల్లి మీద నీళ్ళు గుమ్మరించా.

"కప్ప తల్లీ! వాన పడెయ్యి. చెరువు నింపు. తామరలు పూయించు" అని మొక్కాను.

రోజులు గడుస్తున్నాయి. వాన రాలేదు. చెరువు నిండలేదు. తామరలు పూయలేదు.

చెరువు దగ్గరికి వెళ్ళాను. ఏడిచాను. చింతల కిందకి చేరాను. ఆటలు ఆడలేదు. గుడి స్తంభంమీద కూలబడ్డాను. ఊరు బోసిగా ఉంది. వెలితిగా ఉంది. వెళ్ళిపోయినట్లుంది.

"వాన పడదా! చెరువు నిండదా!! తామరలు పూయవా!!!" నర్సయ్యను అడిగాను.

"వాన కురుస్తది. ఇయ్యాళ బోనాలు పడ్తున్నారు" అన్నాడు.

ఆ సాయంత్రం మంచి బట్టలు వేసుకొని బయలుదేరాను. ముందు డప్పులవాళ్ళు - కొమ్ములవాళ్ళు సాగుతున్నారు. వారు కొమ్ములు ఊదినప్పుడు నాకు వింత అనుభూతి కలిగేది. గుండెలో ఉరుము ఉరిమి క్రమంగా జారిపోతున్నట్లనిపించేది. డప్పుల చప్పుళ్లకు ఎగరాలనిపించేది. ఎగిరేవాణ్ణి.

వారి వెనుక ఆడవారు. కడవల దొంతరలు - బిందెల దొంతరలు పెట్టుకున్నారు. దొంతరలకు వేప మండలు కట్టారు. వేపాకు మండలు పట్టుకొని మగవారూ, పిల్లలూ సాగుతున్నారు.

"వాన కురుస్తదా! చెరువు నిండుతదా!! తామరలు పూస్తయా!!!" అక్కడ ఒకర్ని అడిగాను.

"ఓ! కురుస్తది" అన్నారు.

తప్పేలలో నీళ్లు నెత్తిన పెట్టుకొని నేను నడిచాను.

"ఆడపిల్లలు పెట్టుకుంటారు. మగపిల్లలు పెట్టుకోరు." నర్సయ్య అన్నాడు. నేను వినలేదు. తలమీద తప్పేలతో నడిచాను.

ఊరేగింపు చెరువు కట్టకు చేరింది. ముత్యాలమ్మ గుడి ముందు నీళ్ళు గుమ్మరించారు. నేనూ గుమ్మరించాను.

"ముత్యాలమ్మ తల్లీ! వాన పడెయ్యి. చెరువు నింపు. తామరలు పూయించు" అని మొక్కుకున్నాను.

ఆ రాత్రి వానకోసం ఎదిరిచూచాను. ఆకాశంమీదనే దృష్టి ఉంచాను. నల్లని ఆకాశంలో తెల్లని చుక్కలు మిలమిలా మెరుస్తున్నాయి. ఆశ మోసుకొని ఒక మబ్బు ముక్క వచ్చింది. ఆశలు వమ్ము చేసింది. చిటపట చినుకులు రాల్చింది. తేలిపోయింది.

రోజులు గడుస్తున్నాయి. వాన రాలేదు. చెరువు నిండలేదు. తామరలు పూయలేదు.

"వాన పడదా! చెరువు నిండదా!! తామరలు పూయవా!!!" నర్సయ్యను అడిగాను.

"ఇయ్యాళ సాయెబులు చెరువులో నవాజు చేస్తరట." నర్సయ్య చెప్పాడు.

ఆ సాయంకాలం చెరువు దగ్గరికి వెళ్ళాను. సాయెబులు తళతళ మెరిసే షేర్వానీలు వేసుకొని కూడారు. కొంతమందికి గడ్డాలున్నాయి.

"నవాజు చేస్తే వాన కురుస్తదా! చెరువు నిండుతదా!! తామరలు పూస్తయా!" ఒకరిని అడిగాను. "ఓ! కురుస్తది" అన్నాడు.

సాయెబులంతా చెరువులోకి దిగారు. వరుసలుగా నుంచున్నారు.

నేనూ వారి వెంట సాగాను. నర్సయ్య వెనక్కు లాగాడు. సాయెబులు వరుసలుగా వంగారు. కూర్చున్నారు. ఏదో చదివారు. లేచారు. వెళ్లిపోయారు.

ఆ రాత్రి వానకోసం ఎదిరిచూచాను. ఆకాశంమీదనే దృష్టి ఉంచాను. నల్లని ఆకాశంలో తెల్లని చుక్కలు మిలమిలా మెరుస్తున్నాయి. ఆశ మోసుకొని ఒక మబ్బు ముక్క వచ్చింది. ఆశలు వమ్ము చేసింది. చిటపట చినుకులు రాల్చింది. తేలిపోయింది.

రోజులు గడుస్తున్నాయి. వాన రాలేదు. చెరువు నిండలేదు. తామరలు పూయలేదు.

చింతల కిందికి వెళ్ళడం మానేశాను. నర్సయ్య మా ఇంటికి వస్తున్నాడు. వానను గురించే ఆలోచన! ఏం చేయాలో తోచదు. ఉన్నట్లుండి ఆకాశమంత పెరగాలనిపించేది. అప్పుడు మబ్బులు లాక్కొచ్చి కురిపించవచ్చు. మునికాళ్లమీదతా చూస్తే గూడు అందలేదు.

ఎ.బి.కె. ప్రసాద్‌తో రంగాచార్య దంపతులు

దేవుడు వాన పడెయ్యడంలేదు. దేవుడు చెడ్డవాడా? దేవుని పటం చూచాను. దేవుడి చేతిలో తామరపూవు ఉంది. తామరలంటే దేవుడికీ ఇష్టమే! దేవుడికి తన తామరయే ఇష్టంలాగుంది. చెరువు నిండా తామరలు చూడలేడేమో! దేవుని చేతిలోని తామర లాక్కుంటే సరి! చెరువులో తామరలు పూయిస్తాడు! దేవునికి కావాలిగా ఒకటి! పీట వేసుకున్నా పటం అందలేదు.

ఒకనాడు నర్సయ్య ఉరికివచ్చి చెప్పాడు సీత వచ్చిందని. వెళ్లి చూచాను. సీత స్తంభంమీద మౌనంగా కూర్చుంది. అశోకవనంలో సీతలా ఉంది. ఆమె ముందు పూలు లేవు. ఆమె మాల అల్లడం లేదు. ఆమెలో విషాదచ్ఛాయలు కనిపించాయి.

నేను ఆమె పాదాల చెంత కూర్చున్నాను. ఆమె నన్ను చూచింది. మాట్లాడలేదు. నాకు దుఃఖం వచ్చింది.

"సీతా! వాన పడదా? చెరువు నిండదా? తామరలు పూయవా?" నా మాటలు కన్నీట తడిశాయి.

సీత నన్ను ఒక రకంగా చూచింది. ఆ చూపులో ఆర్ద్రత ఉంది, తడి ఉంది, ఆప్యాయత ఉంది.

"రేపు చెరువులో విరాటపర్వం పురాణం చెప్తతరట. వాన వస్తది. చెరువు నిండుతది. తామరలు పూస్తయి" అన్నది. ఆమె మాటల్లో అంతులేని విశ్వాసం దర్శనం ఇచ్చింది.

"సీతా! నువ్వొస్తవా చెరువుకు?"

"వస్త కద" అన్నది. ఆమె కళ్లు తామర రేకులంత అయినాయి.

సీతా, నేనూ జంటగా ఇళ్లకు చేరుకున్నాం.

రేపు రానే వచ్చింది. గ్రామం సాంతం చెరువు దగ్గరే చేరింది. నడిచెరువులో పందిరి వేశారు. బారుగడ్డం - తేజోవంతములయిన నేత్రముల స్వామి తివాచిమీద కూర్చున్నారు. వారి ముందు వ్యాస పీఠం. వ్యాస పీఠంలో భారతం. వారి ప్రార్థన మేఘ గంభీరంగా ఉంది. వారి గొంతు కంచుగంట.

విరాటపర్వం ప్రారంభం అయింది.

సీత మర్రి నీడలో కూర్చున్నది. మాల అల్లుతున్నది. నేను ఆమె పాదాల చెంత కూర్చున్నాను. ఆమె వ్రేళ్ల కదలిక - మాల అల్లిక చూస్తున్నాను.

"సీతా!"

సీత చూచింది.

"చెరువు చూసినవా! బీటలు వారింది."

సీత తొలిసారిగా బీటలు వారిన చెరువును చూచింది. చూస్తూనే ఉంది.

సీత కళ్లను చూచాను.

ఆమె కనులు ఎండిపోయాయి. ఆమె కనుపాపల్లో బీటలు వారిన చెరువు దర్శనం ఇచ్చింది.

సీత గంభీరంగా ఉంది.

"సీతా!"

పలుకలేదు.

"వాన వస్తుందా?"

"వాన కురుస్తుంది. చెరువు నిండుతుంది. తామరలు పూస్తయి." ఆమె ధ్వనిలో శాసనం ఉంది.

సీత కళ్లను చూచాను.

సీత కళ్లలో నీరు నిండింది.

ఆమె కనులు నిండిన చెరువుల్లా ఉన్నాయి.

సీత ఆకాశంలోకి చూచింది.

నేనూ ఆకాశంలోకి చూచాను.

మబ్బులు కమ్ముకుంటున్నాయి. ఏనుగులు గుంపులా సాగి వస్తున్నాయి. చల్లని గాలి వీస్తున్నది.

క్షణాల్లో ఆకాశం మేఘచ్ఛన్నం అయింది.

ఇద్దరమూ ఆకాశాన్నే చూస్తున్నాం.

ఫెళ ఫెళార్భటులతో ఉరుములు వినిపించాయి.

శిశిర వృక్షాల్లా మెరుపులు మెరిశాయి.

చినుకులు! చినుకులు! చినుకులు -

జల్లు! జల్లు! జల్లు!

జోరున వాన - విస్సురు గాలి.

సీతా - నేనూ చెట్టపట్టాలు పట్టుకొని ఎగిరాం.

వాన నీరు ముక్కు మీదినుంచి కారుతుంటే చప్పరించాం.

వాన దంచుతున్నది.

మేము ఎగురుతున్నాం.

ఆడుతున్నాం.

మంచి మనసు చలించాలి.

అంతే.

ప్రకృతి పులకిస్తుంది.